క్లుప్తంగా

జగనన్న ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

కాకినాడ రూరల్: జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేసేలా లబ్ధిదారులను ప్రోత్సహించాలని నియోజకవర్గ ప్రత్యేకాధికారి, డిప్యూటీ కలెక్టరు సునీత పేర్కొన్నారు. రమణయ్యపేటలో మండల పరిషత్ కార్యాలయంలో డీఎల్‌డీఓ పి.నారాయణమూర్తి అధ్యక్షతన అధికారులతో హౌసింగ్ స్టేజ్ కన్వర్షన్‌పై బుధవారం సమావేశం నిర్వహించారు. నేమాం, తిమ్మాపురం, పండూరు గ్రామాల్లోని ఇళ్ల నిర్మాణాలపై సమీక్షించారు. ఎంపీడీఓ శ్రీనివాస్, హౌసింగ్ ఏఈ నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న శ్రీనివాసరావు

కరప: మండలం అరట్లకట్టలో ఇటీవల మరణించిన బాధిత కుటుంబానికి విశ్రాంత కార్మిక శాఖ ఉద్యోగి వంకాయల శ్రీనివాసరావు బుధవారం రూ.25 వేలు ఆర్థిక సాయం అందించారు. అరట్లకట్ట గ్రామానికి చెందిన వ్యవసాయ కూలి షేక్ వీరబాబు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయం తెలుసుకున్న శ్రీనివాసరావు బుధవారం అరట్లకట్టలో మృతుని భార్య షేక్ మౌలాబికి ఆర్థిక సాయమందించారు. కరప మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు, యరమాటి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్‌గా నరసింహారావు



కాకినాడ లీగల్: కాకినాడ మూడో స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్‌గా వి.నరసింహారావును ఈనెల 18న నియమిస్తూ ప్రభుత్వ న్యాయశాఖ కార్యదర్శి జి.సత్య ప్రభాకరరావు ఉత్తర్వులు జారీ చేశారు. అనంతరం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ పెండింగ్ కేసులు వేగవంతంగా పరిష్కరిస్తామని అన్నారు. ఆయన న్యాయశాఖలో అమలాపురంలో 1985 సంవత్సరంలో విధుల్లో చేరి వివిధ హోదాల్లో పనిచేశారు. కాకినాడ వివిధ కోర్టుల్లో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వర్తించారు. 2020 సంవత్సరంలో నరసింహారావు పదవీ విరమణ చేశారు.

బాలకృష్ణ కృషి ఎనలేనిది

బోట్‌క్లబ్: స్థానిక రోటరీహాల్‌లో బుధవారం సీనియర్ సభ్యుడు డాక్టర్ బాలకృష్ణను సత్కరించారు. రోటరీ గోల్డెన్‌జూబ్లీ క్లబ్ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో రోటరీ హాస్పిటల్‌లో అవసరమైన మౌలిక వసతుల కల్పనకు తీసుకున్న శ్రద్ధ వల్లే అప్పటి ఎంపీ తోట నరసింహం కృషితో డయాలసిస్ యూనిట్ ఏర్పాటు చేశారన్నారు. రోటరీ వృద్ధాశ్రమ కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టి నగరంలో ప్రముఖుల భాగస్వామ్యంతో 60 మందిని అన్నపూర్ణ పథకంలో చేర్చి, రూ. 30 వేలు చొప్పున విరాళాలు అందించారన్నారు. ప్రస్తుతం రోటరీ బ్లడ్‌బ్యాంకు చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టి కొత్త వైద్య పరికరాల ఏర్పాటుకు తమ వంతు కృషి చేస్తున్నారన్నారు. క్లబ్ అధ్యక్షుడు జీవీ కృష్ణప్రకాష్, కార్యదర్శి వడ్డాది ఆదిత్య పాల్గొన్నారు.

చెస్‌లో ఆదిత్య విద్యార్థిని ప్రతిభ

బాలాజీచెరువు: రాష్ట్ర స్కూల్ గేమ్స్ చెస్ అకాడమీ నిర్వహించిన చెస్ పోటీల్లో ఆదిత్య గంగరాజు నగర్ విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో మొదటి రెండు స్థానాలు సాధించారు. అండర్-15 జూనియర్స్ విభాగంలో ఎస్.దామిని నాగసాయిశ్రీలక్ష్మి మొదటి స్థానం, అండర్-17 సీనియర్స్ విభాగంలో ఎస్.కుంజల్ నాగలక్ష్మి అన్నపూర్ణ ద్వితీయ స్థానం సాధించారు. ఈ సందర్భంగా వీరిని ఆదిత్య విద్యా సంస్థల చైర్మన్ శేషారెడ్డి అభినందించి జాతీయ పోటీలకు వెళ్లడంపై హర్షం వ్యక్తం చేశారు. వీరిద్దరు అక్కాచెల్లెళ్లు కావడం విశేషమని అన్నారు.

దేవుని అనుగ్రహం కోసం ప్రార్థించండి



కార్యక్రమంలో బ్రదర్ అనిల్‌కుమార్, ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

కాకినాడ: ప్రతిరోజూ కృతజ్ఞతా భావంతో జీవించమని, మనం దైవాన్ని అంగీకరించకపోయినా ఆయన మనల్ని ఆదరిస్తాడని బ్రదర్ అనిల్‌కుమార్ అన్నారు. స్థానిక ద్వారంపూడి భాస్కరరెడ్డి, పద్మావతి కళ్యాణమండపంలో 'థాంక్స్ గివింగ్' సభలో ఆయన మాట్లాడారు. అనంతరం ట్రినిటీ హాస్పటల్ నిర్వహించిన కార్యక్రమంలో ఆయనకు స్వాగతం పలికారు. ట్రినిటీ హాస్పటల్ డైరెక్టర్ రిక్కి గూటం అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, జాషువా గూటం, నెహెమ్యా గూటం, టీజీ సుధీర్, లెనోరా ఇనిస్టిట్యూట్స్ చైర్మన్ జాన్ రత్నం తదితరులు పాల్గొన్నారు.

ఒట్టు.. ఓటు వేస్తాం..

- ప్రతినబూనిన యువత, ఉద్యోగులు, ప్రజలు
- ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం
- ఓటు విలువపై అవగాహన కల్పించిన ఆర్డీఓ, అధికారులు, స్వచ్ఛంద సంస్థలు



ఓటు హక్కుపై ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

కాకినాడ రూరల్: ప్రజాస్వామ్యంలో ఓటు బలమైన ఆయుధమని ఆర్డీఓ, రూరల్ నియోజకవర్గ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి బీవీ రమణ పేర్కొన్నారు. రమణయ్యపేట రాజీవ్ గాంధీ కళాశాలలో బుధవారం నియోజవర్గ స్థాయి ఓటర్ల దినోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తొలుత విద్యార్థులకు ముగ్గులు పోటీలు, వివిధ ఆటల పోటీలు, వ్యాస రచన, వక్తృత్వ పోటీలను నిర్వహించారు. కళాశాల విద్యార్థులు, నన్నయ వర్శిటీ విద్యార్థులు పోటీల్లో పాల్గొనగా విజేతలకు బహుమతులు అందించారు. సీనియర్ ఓటర్లను సత్కరించారు. ఆర్డీఓ మాట్లాడుతూ ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగమైన శాసన వ్యవస్థ రూపకల్పనకు ఓటు ఒక వజ్రాయుధమన్నారు. తహసీల్దార్లు మురార్జీ, శ్రీనివాసరావు, రాజీవ్‌గాంధీ కళాశాల డైరెక్టరు ఎం.వెంకట్రావు, బూత్ స్థాయి అధికారులు, వీఆర్వోలు తాతారావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నన్నయ పీజీ సెంటర్‌లో నమూనా పోలింగ్

ఈ సందర్భంగా అచ్చంపేట జంక్షన్ వద్ద ఆదికవి నన్నయ ఎంఎస్ఎన్ పీజీ సెంటర్లలో పొలిటికల్ సైన్స్ అండ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగం ఆధ్వర్యంలో డాక్టర్ ఎం.సత్యనారాయణ అధ్యక్షతన బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో నమూనా పోలింగ్ నిర్వహించి విద్యార్థులకు ఓటు చేసే విధానాన్ని వివరించారు. హెచ్‌ఓడీ జోసఫ్ స్టీఫెన్ విద్యార్థులకు ఓటు హక్కు ప్రాధాన్యాన్ని తెలియజేశారు. హరిబాబు, గోపి, అజయ్‌రతన్, నదీమ్ పాల్గొన్నారు.

సర్పవరం జంక్షన్‌లో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ ఓటర్ల దినోత్సవంలో సీనియర్ ఓటరు, విశ్రాంత తహసీల్దార్ రేలంగి బాపిరాజును ఘనంగా సత్కరించారు. ట్రస్ట్ చైర్మన్ రత్న ప్రసాద్, రవిశంకర్ పట్నాయక్ పాల్గొన్నారు.

అందరూ ఓటుహక్కు వినియోగించుకోవాలి

కరప: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అందరూ వినియోగించుకోవాలని ఎంపీడీఓ కర్రె స్వప్న, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి పేర్కొన్నారు. జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా బుధవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సిబ్బందితో ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడారు. 'ఓటును నియోగించుకోండి, ప్రజాస్వామ్యాన్ని కాపాడండి', 'బులెట్ ద్వారా సాధించలేనిది, బ్యాలట్ ద్వారా సాధించవచ్చు', అని అవగాహన కల్పించి, ప్రతిజ్ఞ చేయించారు. వైఎస్సార్ సీపీ నాయకులు పెంకే సత్తిబాబు, వాసంశెట్టి రామారావు, ఈఓ పీఆర్డీ ఎస్వీ శ్రీనివాసరావు, ఏపీఓ ఈవీ రమణ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే మండలంలోని పెనుగుదురు సంధ్య ఫిజియోథెరపీ కళాశాలలో ఓటరు దినోత్సవాన్ని నిర్వహించారు. తహసీల్దార్ పి.శ్రీనివాసరావు ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. కళాశాల సెక్రటరీ బి.శివశిరీష, డైరెక్టర్ బి.భరత్‌రెడ్డి పాల్గొన్నారు.

జీజీహెచ్ సిబ్బంది ప్రతిజ్ఞ

కాకినాడ క్రైం: జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా జీజీహెచ్ సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. బుధవారం జీజీహెచ్‌లోని కమ్యూనిటీ హాల్లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఓటు హక్కు తప్పకుండా వినియోగించుకుంటామని, ప్రతి ఓటరుకు ఓటు ప్రాధాన్యాన్ని వివరించి ఓటు వేసేలా ప్రోత్సహిస్తామని ఒట్టు పెట్టారు. సూపరింటెండెంట్ డాక్టర్ హేమలత, అసిస్టెంట్ ఆర్ఎంవో డాక్టర్ రాహుల్, నర్సింగ్ సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

జిల్లా పరిషత్ కార్యాలయంలో..

కాకినాడ సిటీ: జిల్లా పరిషత్‌లో బుధవారం జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఉద్యోగలందరికి జెడ్పీ సీఈవో ఎన్వీవీ సత్యనారాయణ, ఉప సీఈవో ఎ.రమణారెడ్డి ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. ఉద్యోగులందరితో ప్రతిజ్ఞ చేయించారు. ఎంపీడీవోలు మూర్తి, విజయభాస్కర్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

కాకినాడ: సిటీ పరిధిలో వివిధ అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి బుధవారం శ్రీకారం చుట్టారు. ఎంఎస్ఎన్ చార్టీస్ ఆవరణలో ముఖ్యమంత్రి అభివృద్ధి నిధులు రూ.50 లక్షలతో ప్రతిపాదించిన రహదారి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. 22వ డివిజన్ చిన్న మార్కెట్ సాయిబాబా గుడి వద్ద రూ.20 లక్షలతో ప్రతిపాదించిన నగర పాసింజర్ ఆటో ఓనర్స్ అసోసియేషన్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే ద్వారంపూడి మాట్లాడుతూ ఎంతో చరిత్ర కలిగిన ఎంఎస్ఎన్ చార్టీస్ అభివృద్ధికి తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానన్నారు. పూర్వ విద్యార్థులు, దాతల సహకారంతోపాటు తన సొంత నిధులు కూడా వినియోగించి అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ద్వారంపూడి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వీరభద్రారెడ్డి, కౌడ చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్‌సీపీ నగరాధ్యక్షురాలు, మాజీ మేయర్ సుంకర శివప్రసన్న, మాజీ కార్పొరేటర్లు ఎంజీకే కిశోర్, మీసాల దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, పార్టీ నాయకులు

పలువురికి ఎమ్మెల్యే కన్నబాబు పరామర్శ

కరప: ఎమ్మెల్యే కురసాల కన్నబాబు స్థానిక నాయకులతో కలసి బుధవారం మండలంలో పర్యటించి ఇటీవల మృతిచెందిన వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. నడకుదురులో పిల్లి లక్ష్మణ్, పైలా పెద్దగోవిందు, చీపురపల్లి అప్పారావు, పెనుగుదురులో పోతుల రంగారావు, పెద్దాపురప్పాడులో కోరం పెదసూర్యారావు, కాలకురచ సావిత్రమ్మ, గుబ్బల సూర్యనారాయణ మాస్టారు, సాంబత్తుల రాజారావు, శివారు వై.సావరం గ్రామంలో శనివారపు కామేశ్వరరావు, వాసిరెడ్డి సూర్యభాస్కరరావు, చక్కపల్లి సూర్యకాంతం, వేళంగిలో చంద్రు శ్రీరామతారకం, షేక్ సుబేదా బేగం, తుమ్మల మున్ని కుటుంబ సభ్యులను పరామర్శించి, సంతాపం తెలిపారు. అలాగే వేళంగిలో వైఎస్సార్‌సీపీ నాయకుడు పట్టా కొండలరావు అనారోగ్యంతో ఆపరేషన్ చేయించుకోగా అతనిని కలసి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. కరపలో ఇటీవల మరణించిన నున్న మాణిక్యం, అప్పాపంతుల పుష్పవతి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించి, సంతాపం వ్యక్తంచేశారు. జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, సత్తిబాబు, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, సర్పంచ్ సాదే ఆశాజ్యోతి, గ్రామకమిటీ అధ్యక్షుడు మేడిశెట్టి సత్తిబాబు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



పెద్దాపురప్పాడులో సూర్యభాస్కరరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

ముగ్గురి వైద్యానికి చేయూత

కాకినాడ క్రైం: శ్రీ యువసేన స్వచ్ఛంద సంస్థ కష్టాల్లో ఉన్న మూడు కుటుంబాలకు చేయూత నిచ్చింది. వివిధ కారణాలతో ఆసుపత్రి పాలైన ముగ్గురికి అండగా నిలచి ఆర్థిక సాయం అందించింది. ద్రాక్షారామ మండలం ఎర్రపోతవరానికి చెందిన అడపా మహేష్, వరలక్ష్మి దంపతుల కుమార్తె ఏడేళ్ల సాయిప్రియ కొద్ది రోజుల క్రితం అగ్నిప్రమాదానికి గురైంది. ఈ నేపథ్యంలో కాకినాడలోని ప్రముఖ ప్లాస్టిక్ సర్జన్ డాక్టర్ విష్ణుమూర్తి పర్యవేక్షణలో వైద్య సేవలు పొందుతున్న ఆమెకు శ్రీ యువసేన తరపున రూ.15 వేల ఆర్థిక సాయాన్ని అందించారు. కాకినాడ రాజాజీ వీధికి చెందిన వనుము రాము, లక్ష్మి దంపతుల కుమారుడు శ్రీనివాస్ కొన్ని రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో రెండు కాళ్లు కోల్పోయాడు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అతడి వైద్య ఖర్చులకు రూ.20 వేల ఆర్థికసాయం అందించారు. అలాగే, కాకినాడ బుడంపేటకు చెందిన పొన్నగంటి రాము, సుజాతల కుమారుడు వంశీకృష్ణ రోడ్డు ప్రమాదానికి గురికాగా ముఖం, తల భాగాల్లో తీవ్రగాయాలపాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అతడి వైద్యానికి రూ.20 వేల ఆర్థిక సాయం అందించారు. బుధవారం మూడు బాధిత కుటుంబాలకు కాకినాడలోని శ్రీ యువసేన బ్లడ్ బ్యాంక్‌లో వ్యవస్థాపకుడు బొల్లం సతీష్ ఈ చెక్‌లను అందజేశారు.



శ్రీనివాస్ తల్లి, సోదరుడికి చెక్ అందజేస్తున్న సతీష్

అలరించిన వీణ కచేరీ

కాకినాడ కల్చరల్: ప్రముఖ సంగీత విద్వాంసులు బోనాల శంకర్‌ప్రకాష్ నిర్వహించిన వీణ కచేరీ వీనుల విందుగా సాగింది. సంగీత విద్వత్సభ ఆధ్వర్యంలో స్థానిక సూర్యకళామందిర్‌లో బుధవారం సాయంత్రం బోనాల శంకర్‌ప్రకాష్ (చెన్నై) సంగీత గాత్ర కచేరీ అలరించింది. వీరికి వయోలిన్ ఎం.సత్యనారాయణ శర్మ, మృదంగం ఫాల్గుణ్, ఘటం విద్వాంసులు ఎం.హరిబాబులు సంగీత సహకారం అందజేశారు.



వీణ వాదన చేస్తున్న సంగీత విద్వాంసులు శంకర్‌ప్రకాష్ తదితరులు

ప్రజా సంక్షేమానికే నవరత్నాలు

- ఎమ్మెల్యే కురసాల కన్నబాబు
- వలసపాకలలో గడప గడపకూ..

కరప: ప్రతి కుటుంబానికి ఆర్థిక ప్రయోజనం కల్పించడమే ధ్యేయంగా సీఎం జగన్ నవరత్నాలు అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు అన్నారు. ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చామని చెప్పేందుకే గడప గడపకూ మనప్రభుత్వం నిర్వహిస్తున్నామని అన్నారు. బుధవారం ఆయన స్థానిక నాయకులు, అధికారులు, సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలసి వేములవాడ సచివాలయం పరిధిలోని వలసపాకలలో ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరిస్తూ ఎంతమేర లబ్ధి పొందారో వివరించారు. వలసపాకల, వేములవాడ సర్పంచ్‌లు వాసంశెట్టి రామారావు, కమిడి మంగాదేవి ఎమ్మెల్యే కన్నబాబును ఇంటింటికీ తీసుకువెళ్లారు. అర్హులై ఉండీ పథకాలు అందనివారు దరఖాస్తు చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. ఎస్సీ వీధిలో కమ్యూనిటీ హాలు, సీసీ రోడ్లు, డ్రైన్లు కావాలని కోరగా ఎమ్మెల్యే స్పందిస్తూ సత్వర చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అదనపు తాగునీటి ట్యాంకు మంజూరుచేశామని, రెండు, మూడు నెలల్లో ఇంటింటికీ నీరు వస్తుందని అన్నారు. ఎంపీడీఓ కర్రె స్వప్న, తహసీల్దార్ పి.శ్రీనివాసరావు, ఈఓ పీఆర్డీ ఎస్వీ శ్రీనివాసరావు, కార్యదర్శి పి.వీరభద్రరావు, జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, మండల పార్టీ అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, నాయకులు పెంకే సత్తిబాబు, కమిడి శంకర్, సాదే ఆశాజ్యోతి, లోహిదాస్‌కుమార్, చోడిశెట్టి చంటి, వింత సురేష్ తదితరులు పాల్గొన్నారు.



వలసపాకలలో మహిళలకు సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

పథకాల లబ్ధి పొందుతూ విమర్శలా?

- ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి
- 22వ డివిజన్‌లో గడప గడపకూ..

కాకినాడ: ప్రభుత్వం ద్వారా వచ్చే పథకాల లబ్ధిని పొందుతూనే 'ఇదేం ఖర్మ' పేరుతో టీడీపీ చేస్తోన్న దుష్ప్రచారం హాస్యాస్పదంగా ఉందని సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. స్థానిక 22వ డివిజన్ గొల్లపేట, లంకాడివారి వీధిలలో బుధవారం గడప గడపకూ మన ప్రభుత్వం నిర్వహించారు. కౌడ చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, మాజీ మేయర్ సుంకర శివప్రసన్న, పలువురు మాజీ కార్పొరేటర్లు, అధికారులతో పాటు ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలు తెలుసుకుంటూ మూడేళ్ల పాలనలో ప్రభుత్వం అందించిన లబ్ధిని ప్రజలకు వివరించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే ద్వారంపూడి విలేకర్లతో మాట్లాడుతూ నేరుగా ప్రజలవద్దకే వెళ్లి సమస్యలు అడిగి సత్వరమే పరిష్కరించే అవకాశం దక్కడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. రాజకీయాల్లో మున్నెన్నడూ లేని విధంగా ఇటువంటి కొత్త ఒరవడికి సీఎం జగన్ శ్రీకారం చుట్టారని, ఇందులో భాగస్వామ్యులు కావడం తమకెంతో సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్లు పసుపులేటి వెంకటలక్ష్మి, మీసాల ఉదయ్‌కుమార్, చోడిపల్లి సత్యప్రసాద్, మాజీ కార్పొరేటర్లు ఎంజీకే కిశోర్, నదం, పేర్ల జోగారావు, రోకళ్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ పథకాలను లబ్ధిదారుకు వివరిస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

ఉపకార వేతనాల పంపిణీ



విద్యార్థులకు ఉపకారవేతనాలు పంపిణీ చేస్తున్న నాళం అండాళ్, సత్రం చైర్మన్ వెంకటేష్

బాలాజీచెరువు: నాళం సత్రం ద్వారా ఏటా ప్రభుత్వ పాఠశాల పేద విద్యార్థులకు ఇచ్చే ఉపకారవేతనాలు బుధవారం పంపిణీ చేశారు. స్థానిక సాలిపేట బాలికల ఉన్నత పాఠశాల, శ్రీనగర్, ఆనందభారతి విద్యార్థులకు ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు నాళం అండాళ్ పంపిణీ చేసి మాట్లాడుతూ ఏటా సత్రం ద్వారా రూ.40 లక్షల విలువైన ఉపకార వేతనాలు, పుస్తకాలు, అన్నదానం వంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. సత్రం చైర్మన్ నాళం వెంకటేష్, నాళం అపర్ణ, నాళం కుందన, సత్యనారాయణ, గ్రంధి శిరీష, అచ్చం పూర్ణ, సునీత, ప్రియాంక కపాలిపేట బాలకల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.

ఎస్వీఆర్ విగ్రహానికి క్షీరాభిషేకం



ఎస్వీఆర్ విగ్రహానికి క్షీరాభిషేకం అనంతరం నిరసన వ్యక్తం చేస్తున్న ఎస్వీఆర్ స్మారక సమితి సభ్యులు

కాకినాడ రూరల్: విశ్వవిఖ్యాత నటుడు ఎస్వీ రంగారావుపై సినీ నటుడు బాలకృష్ణ వ్యాఖ్యలను నిరసిస్తూ ఎస్వీఆర్ స్మారక సమితి కాకినాడలో బుధవారం నిరసన వ్యక్తం చేసింది. నాగమల్లితోట జంక్షన్ వద్ద ఎస్వీఆర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేసి బాలకృష్ణ క్షమాపణ చెప్పాలంటూ నిరసన వ్యక్తం చేశారు. సమితి సభ్యులు రావూరి వెంకటేశ్వరరావు, వాసిరెడ్డి సూరిబాబు, నేమాం సర్పంచ్ రామదేవు సూర్యప్రకాశరావు, కడియాల చిన్న తదితరులు మాట్లాడుతూ బాలకృష్ణ వ్యాఖ్యలు సబబు కాదని, క్షమాపణ చెప్పాలన్నారు.

ఆందోళనలకు పిలుపు

కాకినాడ సిటీ: మహిళలకు నటుడు బాలకృష్ణ క్షమాపణలు చెప్పాలని కాపునాడు మేధావుల విభాగం చైర్మన్ డాక్టర్ గనిశెట్టి వెంకట శ్రీరామచంద్రమూర్తి, ప్రధాన కార్యదర్శి చింతా రాజశేఖర్‌లు డిమాండ్ చేశారు. బుధవారం రాత్రి వీరు కాకినాడలో విలేకర్లతో మాట్లాడుతూ బాలకృష్ణ వ్యాఖ్యలను నిరసిస్తూ రిపబ్లిక్ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం అంబేద్కర్ విగ్రహాల వద్ద మౌన ప్రదర్శన చేస్తున్నట్లు ప్రకటించారు.

ఉత్సాహంగా పర్యాటక దినోత్సవం

కాకినాడ సిటీ: జాతీయ పర్యాటక దినోత్సవం ప్రాముఖ్యతను తెలియజేస్తూ బుధవారం పర్యాటక, సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో కాకినాడ మల్లాడి సత్యలింగ నాయకర్ డిగ్రీ కళాశాలలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆ శాఖ అధికారి పసుపులేటి పోశయ్య పర్యాటక రంగం ప్రాముఖ్యతను దాని ఆవశ్యకతను విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులతో 3కె రన్ నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ కె.అమరేశ్వరరావు, ఏపీవోలు అనిశెట్టి వెంకటరావు, వాసంశెట్టి త్రిమూర్తులు, హౌసింగ్ అసిస్టెంట్ మేనేజర్ పోలిశెట్టి రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

పర్యాటకంతో మానసిక ఆనందం

కాకినాడ రూరల్: దేవాలయాలు తదితర పర్యాటక ప్రదేశాలు సందర్శించడం ద్వారా మానసిక ఆనందం కలుగుతుందని గ్రంథాలయ విశ్రాంతి ఉద్యోగి చింతపల్లి సుబ్బారావు పేర్కొన్నారు. సర్పవరం జంక్షన్‌లో బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో జాతీయ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని జరిగిన కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, రేలంగి బాపిరాజు, రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ధర్నా

కాకినాడ సిటీ: విశాఖ ఉక్కుపై ఆంధ్ర బీజేపీ శ్రేణులు మోడీని ప్రశ్నించండి అంటూ ఏఐటీయూసీ, సీపీఐ రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా బుధవారం కాకినాడ ధర్నా చౌక్ వద్ద ధర్నా చేశారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యమానికి ప్రజా సంఘాలు, రాజకీయ పక్షాలు మద్దతు తెలియజేయాలని పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ, సీపీఐ నాయకులు తోకల ప్రసాద్, బోడ కొండ, పప్పు ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్గానిక్ ఉత్పత్తులతో ఆరోగ్యం



సమావేశంలో మాట్లాడుతున్న వేదుల శ్రీరామశర్మ

కాకినాడ రూరల్: రసాయనిక ఎరువులు, పురుగు మందులతో తయారయ్యే ఆహార పదార్థాలతో అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉన్నందున ఆర్గానిక్ ఉత్పత్తుల వినియోగం అలవర్చుకుంటే ఆరోగ్యం బాగుంటుందని ప్రకృతి వైద్యుడు డాక్టర్ వేదుల శ్రీరామశర్మ పేర్కొన్నారు. సర్పవరం జంక్షన్‌లో బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. సేంద్రియ ఎరువుల వినియోగాన్ని గ్రామాల్లో ప్రోత్సహించడం ద్వారా వచ్చే కూరగాయలు, ఆకుకూరల ద్వారా ఆరోగ్య సమస్యలు రావన్నారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, ఓం నమశ్శివాయ, రాఘవరావు పాల్గొన్నారు.

జీజీహెచ్‌కు ఈసీజీ యంత్రాల వితరణ



ఈసీజీ యంత్రాలు అందజేసిన బ్యాంకు యాజమాన్యం

కాకినాడ క్రైం: కెనరా బ్యాంకు కాకినాడ శాఖ ఆధ్వర్యంలో 'కాన్ఫిన్ హోమ్స్' తరపున బ్యాంకు యాజమాన్యం రూ.12 లక్షలు విలువ చేసే ఎనిమిది ఈసీజీ యంత్రాలను జీజీహెచ్‌కు సమకూర్చింది. బుధవారం కెనరా బ్యాంకు మేనేజర్ రామచంద్రయ్య, బ్యాంకు అధికారులు ప్రసన్న, అనిల్, శ్రీనివాస్ ఈ యంత్రాలను జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ హేమలతాదేవి, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ హరి విజయ్‌కుమార్‌లకు అందజేశారు. ఏడీ అన్నపూర్ణ, అసిస్టెంట్ ఆర్ఎంవో డాక్టర్ రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

భయం పోగొట్టేందుకే 'పరీక్షా పే చర్చ'

బోట్‌క్లబ్: విద్యార్థుల్లో పరీక్షల భయం పోగొట్టేందుకే ప్రధాని మోదీ 'పరీక్ష పే చర్చ' ప్రారంభించారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్ అన్నారు. స్థానిక గాంధీనగర్ మున్సిపల్ స్కూల్‌లో బుధవారం పార్టీ మహిళామోర్చా అధ్యక్షురాలు గూడూరి పద్మ ఆధ్వర్యంలో విద్యార్థులకు 'పరీక్ష పే చర్చ' నిర్వహించారు. విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, నోట్ పుస్తకాలు అందించారు. పాఠశాల హెచ్ఎం వెంకటేశ్వరరావు, డ్రాయింగ్ మాస్టర్ తులసీరావు, బీజేపీ నాయకులు సుబ్బారావు, జి ఉదయభానోజీరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు

కాకినాడ రూరల్: మండలంలోని ఇంద్రపాలెం జెడ్పీ హైస్కూల్ వద్ద 'పరీక్ష పే చర్చ'లో భాగంగా విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. రూరల్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి కవికొండల భీమశంకర్ ఆధ్వర్యంలో జిల్లా బీజేపీ ఉపాధ్యక్షురాలు పితాని లీలావతి, కోశాధికారి చోడిశెట్టి రమేష్ సహకారంతో ఈ పోటీలు నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షులు చిలుకూరి రామ్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి రంబాల వెంకటేశ్వరరావు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.

ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర మహాసభలు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): నేతాజీ సుభాష్ చంద్రబోస్ స్థాపించిన అఖిల భారత ఫార్వర్డ్ బ్లాక్ 2వ రాష్ట్ర మహాసభలు బుధవారం స్థానిక పీఆర్ ప్రభుత్వ హైస్కూల్ ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా మద్దూరి అన్నపూర్ణయ్య విగ్రహానికి మాజీ ఎంపీ, ఫార్వర్డ్ బ్లాక్ జాతీయ ప్రధాన కార్యదర్శి దేబబ్రత బిస్వాస్ నివాళులర్పించారు. అనంతరం సీబీఎం కళాశాల ఆవరణలో నిర్వహించిన సభలో 32 మంది సభ్యులతో నూతన రాష్ట్ర కమిటీని, 83 మంది సభ్యులతో రాష్ట్ర సమితిని ఈ మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకుంది. రాష్ట్ర అధ్యక్షుడిగా బి.సుభాష్ చంద్రారెడ్డి, ఉపాధ్యక్షుడిగా లంక కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శిగా పీవీ సుందర రామరాజు, కార్యదర్శిగా అయినాపురపు సూర్యనారాయణ తదితరులు ఎంపికయ్యారు. జాతీయ కార్యదర్శి జ్యోతిరంజన్ మహాపాత్రో, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ ఏపీ రామరాజు తదితరులు ప్రసంగించారు.

వాకాడలో చోరీ

కరప: మండలం వాకాడలో ఒక ఇంటిలో దొంగలుపడి బంగారు, వెండి ఆభరణాలతో పాటు రూ 20 వేలు నగదు దోచుకుపోయారు. కరప ఎస్ఐ ఎన్.రామకృష్ణ తెలిపిన కథనం మేరకు వాకాడకు చెందిన అడబాల సత్తిబాబు తాపీమేస్త్రిగా పని చేస్తుంటాడు. ఈనెల 13న సంక్రాంతి సందర్భంగా సత్తిబాబు ఇంటికి తాళంవేసి, భార్యా, పిల్లలతో సామర్లకోటలోని అత్తవారింటికి వెళ్లాడు. తిరిగి 24 మధ్యాహ్నం ఇంటికి వచ్చారు. బుధవారం ఉదయం బీరువా తెరచి చూసుకునేసరికి బంగారు, వెండి ఆభరణాలు కనిపించలేదు. రెండు కాసులు బంగారు, అరకిలో వెండి సామగ్రి అపహరణకు గురైనట్టు బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నాడు.